క్లుప్తంగా

ఘనంగా వీడ్కోలు



భాస్కర్‌రావును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాణ్యం: స్థానిక ఈఓఆర్డీ భాస్కర్‌రావు వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ ఎంపీడీఓగా పదోన్నతిపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ ఉసేన్‌బీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, ఎంపీడీఓ దస్తగిరి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, ఉప సర్పంచ్ పాలంచంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొని భాస్కర్‌రావును సన్మానించారు.

పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్

సి.బెళగల్: మండల కేంద్రంలోని ఈశ్వర్ వీధిలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు పరిశుభ్రత పనులు చేపట్టారు. సర్పంచ్ పాండురంగన్న, ఏఎన్‌ఎం పుష్పలత, వైద్య సిబ్బందితో కలిసి ఫ్రైడే డ్రైడేను నిర్వహించారు. బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. మురుగు కాలువల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు.

పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలి



రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాణ్యం: ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించి మాదిగలకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ కోరారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరుతూ శుక్రవారం స్థానిక నాగులు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బాబు, నాయకులు తిమ్మయ్య, సుబ్బన్న, నాగరాజు, ఉసేన్‌వలి, పాణ్యం నాగరాజు, సుంకన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులలో 1.026 టీఎంసీల నీరు నిల్వ



సుంకేసుల జలాశయం

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు శుక్రవారం డ్యాం అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇన్ ఫ్లో నిలిచిపోవడంతో దిగువకు నీటి విడుదల నిలిపేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

పాణ్యం: ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలి యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్వర్ణోత్సవ సంబరాల ప్రచార యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన పాణ్యం చేరుకున్నారు. స్థానిక బస్టాండ్‌లో యూటీఎఫ్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహుడు, సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ పరిధి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇంటింటి సర్వేని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు ఇంటింటికి వెళ్లి అవసరమైన వారికి ఏడు రకాల ఆరోగ్యపరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను జేఏఎస్ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ఆరోగ్యసేవలు అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ ఇచ్చి ఈ నెల 30వ తేదీ నుంచి విలేజ్ క్లినిక్/యూపీహెచ్‌సీలో నిర్వహించే వైద్యశిబిరాలకు తరలించి తగిన చికిత్సలు, ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. అనంతరం ఆయన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజలు ఇళ్లు, పరిసరాల్లో నీటి నిల్వలు ఎక్కువ కాలం లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మొబిలైజర్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

- పీఎంశ్రీ ద్వారా ఎంపిక చేసిన స్కూళ్లలో ప్రమాణాల పెంపు
- కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధుల కేటాయింపు
- నంద్యాల జిల్లాలో 28 పాఠశాలల ఎంపిక



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన గడిగరేవుల జెడ్పీ పాఠశాల

గడివేముల: విద్యా వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యం. అందుకే కేంద్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి రాష్ట్రాలకు అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ భారత్ (పీఎంశ్రీ) అనే పేరుతో ఓ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యలో సమూల మార్పులు తీసుకురావడం, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే మిగతా 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటోంది.

పీఎంశ్రీ పథకానికి నంద్యాల జిల్లాలో నుంచి 28 పాఠశాలలను ఎంపిక చేశారు. 2021–22 యూ డైస్ జాబితా ఆధారంగా 48 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ 28 పాఠశాలలను గుర్తించారు. ఆ వివరాలను విద్యాశాఖ అధికారులు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. అరవై శాతం మార్కులు సాధించిన గ్రామీణ ప్రాంతాల పాఠశాలలను పీఎం శ్రీ పథకానికి ఎంపిక చేశారు. గడివేముల మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపికై ంది. ఈ పాఠశాలకు అవసరమైన పనుల నిమిత్తం రూ.116.33 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ తెలిపారు.

మౌలిక వసతుల కల్పన

ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యాబోధన, సదుపాయాలు మరింతగా మెరుగు పరుస్తారు. అంతేగాకుండా అదనపు తరగతి గదులు నిర్మిస్తారు. అదనపు వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రి సమకూరుస్తారు, ఏ మేరకు పనులు చేపట్టాలనే అంశంపై జిల్లా స్థాయి కమిటీలు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాయి. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.

హెచ్‌ఎంల నుంచే ప్రతిపాదనలు

పాఠశాలల్లో ఎలాంటి అదనపు వసతులు కల్పించాలనే అంశంపై ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులే నివేదికలు సమర్పించారు. ఈ నివేదికలు రూపొందించే ప్రక్రియపై ఇప్పటికే విద్యాశాఖ హెచ్‌ఎంలకు మార్గదర్శకాలు జారీ చేసింది. త్వరలో హెచ్‌ఎంలు తమ ప్రతిపాదనలను సమగ్ర శిక్ష అభియాన్‌కు పంపితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి వాటిని కేంద్రానికి పంపుతారు. ఈ పథకం కింద ఐదేళ్ల పాటు పాఠశాలలకు అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు పథకం వల్ల రాష్ట్రంలోని పాఠశాలల రూపురేఖలు మారాయి. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక హంగులకు సాంకేతికతను జోడిస్తున్నారు. తరగతి గదులను డిజిటలైజేషన్ దిశగా తీర్చిదిద్దనున్నారు.

ప్రయోజనాలు ఇవీ

- పాఠశాలలకు దశల వారీగా నిధుల కేటాయింపు
- డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర వసతులు
- ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక తోడ్పాటు
- ప్లాస్టిక్ రహితంగా పాఠశాలలను తీర్చిదిద్దడం, సంప్రదాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన
- హరిత పాఠశాలలుగా మార్చడం
- బడి ఆవరణలో సేంద్రియ విధానంలో కూరగాయల సాగు
- దివ్యాంగ విద్యార్థులకు బోధన పరికరాల ఏర్పాటు
- బాలిక విద్య అభివద్ధి, సైన్స్ ప్రాజెక్టులు
- అందుబాటులోకి గ్రంథాలయం, క్రీడా పరికరాలు
- సోలార్ ప్యానల్స్, ఎల్‌ఈడీ విద్యుత్ దీపాల సౌకర్యం

మరిన్ని సౌకర్యాలు



పీఎంశ్రీ పథకానికి మా పాఠశాల ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఇప్పటికే నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలలను ఆధునికీకరించారు. ఇప్పుడు పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలలకు త్వరలో డిజిటల్ తరగతి గదులు, అత్యాధునిక ల్యాబ్‌లు బోధన సామగ్రి సమకూరనున్నాయి. పిల్లలు విద్యలో మరింతగా రాణించేందుకు అవకాశం లభిస్తుంది. – రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం, గడిగరేవుల జెడ్పీ పాఠశాల

పిల్లలకు ఎంతో ఉపయోగం



పీఎంశ్రీ పథకం ద్వారా విద్యార్థులకు అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో పాటు పాఠశాల అభివృద్ధి చెందుతుంది. పాఠశాలకు అవసరమైన అన్ని సదుపాయాలు సమర్చకూర్చేందుకు రూ.116.33 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే గడిగరేవుల ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందనుంది. ప్రభుత్వ పాఠశాలలు ఇంతగా అభివృద్ధి చెందడం ఎన్నడూ చూడలేదు.
– మల్లికార్జున, నోడల్ ఉపాధ్యాయుడు, గడిగరేవుల

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

సి.బెళగల్: గొల్లలదొడ్డి గ్రామంలో ఆక్రమణలకు గురవతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని గ్రామ పెద్దలు మండల అధికారులను కోరారు. శుక్రవారం గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, చంద్రన్న తదితరులు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్‌లను కలిసి సమస్యలు తెలియజేశారు. ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించుకుంటున్నారని, రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

28న కె.నాగలాపురంలో టెంకాయల వేలం పాట

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరీదేవి ఆలయం వద్ద టెంకాయలను విక్రయించుకునేందుకు ఈనెల 28న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆలయ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి అధ్యక్షతను నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.10,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. అలాగే పూలు, నిమ్మకాయలను విక్రయించుకునేందుకు కూడా వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేసు నమోదు

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని నాయకల్లు గ్రామంలో గుప్త నిధుల కోసం త్వవకాలు జరిపిన వారిపై కేసు నమోదైంది. నాయకల్లు గ్రామం కాశమ్మ గుడి సమీపంలో గురువారం రాత్రి గుప్త నిధుల కోసం కొందరు జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. విషయం తెలుసుకుని గ్రామస్తులు వచ్చే సరికి వారు అక్కడినుంచి పరారయ్యారు. ఈ ఘటనపై వీఆర్వో కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

- ఎంపీపీ ఉసేన్‌బీ



మాట్లాడుతున్న ఎంపీపీ ఉసేన్‌బీ

పాణ్యం: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తోందని ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభోత్సవంలో ఎంపీపీ మాట్లాడారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆసుపత్రిల్లో అధునాతన పరికరాలతో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి గర్భిణి కూడా ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు అయ్యేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రోహెలా, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, బాబు, డాక్టర్లు శ్రీదేవి, రాజశేఖర్‌రెడ్డి, మునిస్వామి, సునీల్, జగన్మోహన్ రెడ్డి, క్రిష్టారెడ్డి, జగదీష్, అనురాధ, శైలజ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

కోడుమూరు: పట్టణంలోని కోటవీధి ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఆర్డీఓ హరిప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఒకే కాపౌండ్‌లో నాలుగు కంటే ఎక్కువ పోలింగ్ బూత్‌లు ఉంటే, వాటిని ఓటర్లకు అనుకూలంగా మరోచోటికి మార్చాలని తహసీల్దార్ జయన్నను ఆదేశించారు. కోడుమూరు బాలుర హైస్కూల్‌లో ఏడు పోలింగ్ బూతులుండగా 235, 245, 246 పోలింగ్ కేంద్రాలను స్థానిక కోటవీధి ప్రాథమిక పాఠశాలలోకి మార్చాలని, ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ సూచించారు.

లారీ బోల్తా పడి క్లీనర్ దుర్మరణం



లారీ కిందపడి ఛిద్రమైన క్లీనర్ బుడ్డ బాషా మృతదేహం

పత్తికొండ రూరల్: పత్తికొండ–రాతన రోడ్డులోని మలుపు వద్ద లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ప్రకాశం జిల్లా కురిచేడు గ్రామానికి చెందిన బుడ్డబాషా (32) దుర్మరణం చెందగా డ్రైవర్ షేక్ నాగూర్‌వలి తీవ్రంగా గాయపడ్డాడు. బావ, బామ్మర్దులైన వీరిద్దరూ గత కొంతకాలం నుంచి క్లీనర్, డ్రైవర్‌గా లారీ ద్వారా సరుకు రవాణా చేస్తుండేవారు. కందుకూరు నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బందేలికి సుబాబుల్ లోడ్‌తో లారీ బయల్దేరింది. అయితే పత్తికొండ–రాతన గ్రామాల మధ్య మలుపు వద్ద అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ప్రమాదంలో క్లీనర్ బుడ్డబాషా లారీ కింద పడి దుర్మరణం పాలయ్యాడు. డ్రైవర్ షేక్ నాగూర్‌వలి తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.





నిమజ్జనానికి సిద్ధమవుతున్న బాలభారతి వినాయకుడు, కోలాట ప్రదర్శన చేస్తున్న బాలభారతి చిన్నారులు

గంగమ్మ ఒడికి గణనాథుడు



పాణ్యం ఊరుముందరి చెరువులో గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వివిధ గ్రామాలలో కొలువుదీరిన గణనాథులు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరుకున్నారు. మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె, శకునాల తదితర గ్రామాలలో గణేష్ నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, డప్పులు, బాణాసంచా పేలుళ్ల శబ్దాలు ఆయా గ్రామాల్లో హోరెత్తించాయి. ఓర్వకల్లులోని ప్రధాన వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని ఆర్టీసీ డ్రైవర్ గోవిందరెడ్డి రూ.50 వేలకు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. బాలభారతి పాఠశాల ఆవరణలో కొలువైన గణనాథుని వద్ద చిన్నారులు ప్రదర్శించిన కోలాటం చూపరులను ఆకట్టుకుంది. యువకుల కేరింతలు, నృత్య ప్రదర్శనల మధ్య గణపతి బప్పా మోరియా, బోలో గణేష్ మహరాజుకే జై అంటూ జేజేలు పలికారు. ఊరేగింపుగా వెళ్లిన విగ్రహాలను సమీపంలోని కుందూ వాగులో నిమజ్జనం చేశారు. భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం, పెంచికలపాడు గ్రామాల్లో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 18న వినాయక చవితిని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో భక్తులు విగ్రహాలను మండపాల్లో కొలువుంచారు. ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో భక్తులు వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం వినాయక విగ్రహాలను వాహనాల్లో ఉంచి ఆయా గ్రామాల్లో భక్తులు మేళతాళాలు, డీజే, డ్రమ్స్ వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఆయా విగ్రహాలను నిమజ్జన నిమిత్తం కర్నూలులోని కేసీ కెనాల్‌కు తరలించారు. ఎస్‌ఐ సోమ్లానాయక్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



పెంచికలపాడులో వినాయక విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

పాణ్యం: వినాయక చవితి పురస్కరించుకోని గత ఐదు రోజులుగా మండపాల్లో కొలువుదీరిన వినాయకులకు నిర్వహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అధికారుల సూచనలతో వినాయకులను నిమజ్జనానికి తరలించారు. మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర రాత్రి వరకు కొనసాగింది. ఎస్‌ఐ పి.అశోక్ ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు. నిమజ్జన ఘాట్‌ల వద్ద జాగ్రత్తలు తీసుకున్నారు. రాత్రి వేళ ఇబ్బంది కలుగకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. వినాయక విగ్రహాలను ప్రశాంతంగా చెరువులో నిమజ్జనం చేశారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని కృష్ణానగర్ ప్రాంతంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కల్లూరు ఎస్టేట్ ఆపరేషన్స్ ఏఈఈ నాగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్లలో చేపట్టనున్న అభివృద్ధి పనుల కారణంగా అబ్బాస్ నగర్, ఫరీఫ్ నగర్, కృష్ణానగర్, హౌసింగ్ బోర్డు, రామచంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చిరుత కలకలం



పత్తికొండ–చక్రాళ్ల రోడ్డులోని కొండపై చిరుత

పత్తికొండ రూరల్: పత్తికొండ–చక్రాళ్ల రోడ్డులోని కొండ ప్రాంతంలో చిరుత సంచారం శుక్రవారం కలకలం రేపింది. రైతుల నుంచి విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారి రామ్మోహన్ కొండ ప్రాంతంలోని పొలాల వద్ద పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గతంలో కొన్నినెలల క్రిందట ఈ ప్రాంతంలో చిరుత పాద ముద్రలను ఫారెస్టు అధికారులు సేకరించారు. తరువాత కొంతకాలం చిరుత జాడ కనిపించలేదు. తాజాగా చిరుత సంచారంతో రైతులు పొలానికి ఒంటరిగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. చిరుత సంచారంపై నిఘా ఏర్పాటు చేసి అవసరమైతే ఉన్నతాధికారుల సూచనల మేరకు బోను ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారులు చెప్పారు.

మారెమ్మ బ్రహ్మోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి పుట్లూరు మారెమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు
- 6 రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు
- రేపు రాత్రి భజన పోటీలు, 25న రాత్రి గాయని మధుప్రియతో జానపద కచేరి
- మూడు రోజులు అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు
- రెండు రాష్ట్రాల నుంచి పాల్గొననున్న భక్తులు



గ్రామ శివారులోని ముఖద్వారం

కృష్ణగిరి: భక్తుల ఆరాధ్య దైవం, కొలిచే వారికి కొంగు బంగారమైన పుట్లూరు మాతా మారెమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు రేపటి (ఆదివారం) నుంచి 29వ తేదీ వరకు ఆరు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు రాయలసీమ జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామంలోని హంద్రీ నది ఒడ్డున వెలసిన అమ్మవారికి ఏటా బాద్రపద శుక్ల చతుర్థి మొదలుకొని బహుళ చవితి వరకు అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరిపేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ గ్రామం వెల్దుర్తి నుంచి కృష్ణగిరికి వెళ్లే దారిలో చెరుకులపాడు గ్రామం దాటిన వెంటనే ప్రధాన రహదారికి అనుకుని ముఖద్వారం ఉంది. ఈ ముఖద్వారం నుంచి రెండు కిలోమీటర్లు వెళితే పుట్లూరు గ్రామం వస్తుంది.

ఇక్కడి ప్రత్యేకత

ఇక్కడి అమ్మవారికి భక్తులు సమర్పించిన టెంకాయలు, మొక్కులు తీర్చుకున్న సమయంలో ప్రసాదాలు తదితర ప్రసాదాలు గ్రామం పొలిమేర దాటి వెళ్లకూడదు. ఇదే ఆచారం గత 200 ఏళ్లుగా కొనసాగుతోందని గ్రామస్తులు తెలిపారు. పొరబాటున తీసుకెళితే గ్రామ పొలిమేర దాటేలోగా వారికి కీడు జరుగుతుందని గ్రామస్తుల నమ్మకం.

అమ్మవారి చరిత్ర

201 ఏళ్ల క్రితం గ్రామానికి అనుకుని ఉన్న పాల హంద్రీలో అమ్మవారి ప్రతిమ వరదలో బయటపడడంతో గుర్తించిన పెద్దలు హంద్రీ ఒడ్డున అమ్మవారిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతేడాది అమ్మవారికి తిరునాల జరుపుకుంటూ వస్తున్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల కొర్కెలు తీరుతుండటంతో ప్రతి మంగళవారం అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు భారీగా వస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామస్తుల సహకారంతో గత 18 ఏళ్లుగా మూడు నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు జరుపుతున్నారు. గత నాలుగేళ్లుగా 6 రోజుల బ్రహ్మోత్సవాలు జరిపేందుకు కమిటీ సభ్యులు సిద్ధం చేస్తున్నారు.

ఆరు రోజులపాటు కార్యక్రమాలు



మారెమ్మ అమ్మవారి మూలవిరాట్

- రేపు (ఆదివారం) గ్రామ శివారులోని ముఖద్వారం వద్ద పూజలతో జాతర ప్రారంభం అవుతుంది. ఇదే రోజు ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలను అందించనున్నారు.
- 25న అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజలు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు పొట్టేళ్ల పోటీలు నిర్వహించి గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ.15 వేలు, రూ.12.5 వేలు, రూ.10 వేలు, రూ.7.5 వేలను అందిచనున్నారు. అలాగే ఉదయం 11 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 9 గంటలకు ప్రముఖ గాయని మధుప్రియ, మానుకోట ప్రసాదు, మద్యల సందీప్‌లతో జానపద కచేరి నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.
- 26న అమ్మవారిని ప్రత్యేక నగలతో అలంకరించి ప్రతి ఇంటి నుంచి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకునే కార్యక్రమం ఉంటుంది.

మూడు రోజుల పాటు బండలాగుడు పోటీలు

- 27న పాలపండ్ల విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ. 25 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు అందించనున్నారు.
- 28న న్యూ కేటగిరీ విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు ప్రదానం చేస్తారు.
- 29న సీనియర్ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలను అందించనున్నట్లు వారు తెలిపారు. వివిధ పోటీల్లో పాల్గొనే వారు 86393 63721, 75693 90793, 95738 88304 ఫోన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఆరు రోజుల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

రూ. 4 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం

మాతా మారెమ్మ అమ్మవారి నూతన ఆలయాన్ని గ్రామస్తులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. తిరుపతికి చెందిన శిల్పుల చేత దాదాపు రూ.4కోట్ల ఖర్చుతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఆలయ నిర్మాణం పూర్తి కావడానికి మూడేళ్లు పడుతుందని వారు తెలిపారు. గత కొన్నేళ్లుగా అమ్మవారికి వస్తున్న కానుకలతోపాటు, గ్రామస్తుల చందాలు, ఇతర ప్రాంతాల భక్తుల విరాళాలతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కృష్ణగిరి: ఆంధ్రప్రదేశ్ గట్కా చాంపియన్‌షిప్ పోటీల్లో కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయానికి చెందిన విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 17న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జరిగిన అండర్–14, 18 విభాగంలో తమ విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉందన్నారు. 9వ తరగతి విద్యార్థినులు మమత, లావణ్య బంగారు పతకాలు, అలాగే హారిక, జాస్మిన్, ఎస్తేర్‌రాణి, 10వ తరగతి విద్యార్థిని కల్యాణి వెండి పతకాలు, హరిప్రియ, స్వాతి, అనూష, హారిక మంజుల మూడో స్థానంలో నిలిచి కాంసత్య పతకాలు సాధించినట్లు ఆమె తెలిపారు.